

# పుస్తక పరిచయం




**జీవితం ఒక ప్రవాహం.** ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎంతమందినో కలుపుకుంటూ సాగే నిరంతర స్రోతస్విని జీవితం. మనుషులూ, మలుపులూ, అనుభవాలూ, జ్ఞాపకాలూ.. ఏ జీవితంలో నైనా సహజమే. ఇబ్బందులూ, కష్టాలూ లేని జీవితం ఎక్కడా ఉండదు. అన్నింటినీ అధిగమిస్తూ జీవితాన్ని అందంగా అలంకరించుకోవడం కొద్ది మందికే సాధ్యమౌతుందేమో. వెనిగళ్ళ కోమలగారి 'జీవితమే నవీనం' చదువుతుంటే 'అందమైన జీవితం' అనే మాటకి సార్థకత చేకూరడమంటే ఇదేనేమో అనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబంలోని ఆత్మీయతలూ, పరిసరాలూ, చిన్నప్పటి అనుభవాలూ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుతాయో తెలుసుకోడానికి కోమలగారి జీవితం ఒక ఉదాహరణ. ఓ చిన్నపిల్ల 'డాక్టర్నవుతా.. అమెరికా పోతా..' అనేది, ఆ మాటలకి అర్థాలు కూడా సరిగా తెలీని వయసులో. సంవత్సరాలు దొర్లిపోయాయి. ఆ చిన్నపిల్ల ఏమీ తెలీని వయసులో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించింది. అమెరికాలో వైద్యవృత్తిలో స్థిరపడింది. ఓ కుర్రాడు ఇంటర్మీడియట్ చదివేప్పుడు జస్టిస్ జగన్మోహన రెడ్డిగారు తన ఆటో బయోగ్రఫీ చదివి ఎలా ఉందో చదివి చెప్పమన్నారు. ఆ కుర్రాడు ఆ పుస్తకం అంతా చదివి 'మీరేమన్నా బెర్ట్రాండ్ రస్సెల్ అనుకుంటున్నారా? ఈ సోది అంతా అంతా ఎవరు చదువుతారు..ఈ వివరాలు తీసెయ్యండి' అని చెప్పాడు. ఆ కుర్రాడు పెరిగి పెద్దవాడై యంగ్ గ్లోబల్ లీడర్గా వరల్డ్ ఎకానామిక్స్ ఫోరమ్‌కి ఆహ్వానించబడ్డాడు. 2008లో చైనా ఒలింపిక్స్‌కి స్టేట్ గెస్ట్ - టార్చ్ బేరర్గా వెళ్ళాడు. అంతర్జాతీయ జర్నలిజంలో తనదైన ముద్రవేశాడు... ఈ అమ్మాయి , అబ్బాయిలని తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకి అనుగుణంగా తీర్చిదిద్దిన తల్లి వెనిగళ్ళ కోమలగారు.కోమలగారి కూతురు నవీన, కుమారుడు రాజు. భర్త డా.ఇన్నయ్యగారు ప్రముఖ హేతువాది, మానవతావాది. ఆయన ఆదర్శాలకి అనుగుణంగా ఉంటూనే సొంత భావాలని పెంపొందించుకుంటూ జీవితాన్ని కొనసాగించారు కోమలగారు. ఓపెన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్గా పనిచేసి పదవీవిరమణ చేసిన కోమలగారు చక్కటి అనువాదాలు కూడా చేశారు. మూల్పూరులో పుట్టిన వద్దనుంచి మేరీలాండ్‌లో స్థిరపడే వరకూ జరిగిన జీవితానుభవాలకి అత్యంత ఆసక్తికరమైన అందమైన పుస్తక రూపం ఇచ్చారు. ఈ జీవితచరిత్ర చదువుతున్నంత సేపూ ఎవరో ఆత్మీయురాలు తన మనసులోని భావాలని, బ్రతుకుపుటలనీ మనతో పంచుకుంటున్న అనుభూతి కలుగుతుంది. ఇటీవలే తమ 50వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న కోమల, ఇన్నయ్య గార్లు చేసిన చేస్తున్న సామాజిక సేవ ప్రశంసనీయమైనది, అనుసరణీయమైనది.

****

***Copies Available at:***
**Na**vodaya Book House
Opp. To Aryasamaj Mandir
Kachiguda X Roads
Badechowdi,HYDERABAD

All leading book stores




***Writer:***
Dr. Akkiraju Ramapathi Rao
2-2-18/47 B-20, # 104
Sri Saikrupa Residency
DD Colony
HYDERABAD – 500 013
Phone: 27423352

**ఇరవయ్యవ శతాబ్దపు** మొదటి అర్థభాగంలో భారతదేశచరిత్రని పరిశీలిస్తే స్ఫూర్తిదాయకమైన కథనాలెన్నీ కనిపిస్తాయి. జాతీయోద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యసమరంలో పోరాడిన మహనీయుల జీవితాలు ఎప్పటికీ ఉత్తేజపూరితంగా నిలుస్తాయి. అందులో కొంతమంది కేవలం స్వాతంత్ర్యోద్యమానికే పరిమితం కాకుండా భారతదేశ సర్వతోముఖాభివృద్ధికోసం ఎన్నో ప్రణాళికలని రచించి అమలుపరిచారు. ఒక జీవిత కాలంలో వాళ్ళు చేసిన కృషిని గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఒక్క మనిషి ఇన్ని వైవిధ్యభరితమైన రంగాల్లో ఇన్ని విజయాలని సాధించగలరా అని విస్మయం కలుగుతుంది. ఇంకా ముందుకి వెళ్ళి అలాంటి వ్యక్తుల నేపథ్యాలని పరిశీలిస్తే మరింతగా ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటి కోవకి చెందిన వ్యక్తి భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు. ఆయన పేరు వినగానే ఆంధ్రాబ్యాంక్ గుర్తొస్తుంది. కానీ అంతకు మించిన చరిత్ర ఎంతో ఉంది సీతారామయ్యగారికి. ఆయన గొప్ప మేధావి. సంస్థానిర్వహణ దక్షుడు. సాంఘిక పునర్నిర్మాణ కాంక్షాశీలి. సృజనాత్మక ప్రతిభాశాలి. గాంధీజీకి ముఖ్య అనుయాయి. సలహాదారుడు. తొమ్మిదో తరగతి వరకూ చొక్కా ఎలా ఉంటుందో తెలీని బీదరికం నుంచీ వచ్చి మద్రాసు మెడికల్ కాలేజీలో ప్రథమ బాచ్‌లో డిగ్రీ అందుకున్న డా.పట్టాభిసీతారామయ్యగారు అనూహ్యమైన ఉన్నతశిఖరాలని అధిరోహించారు. మచిలీపట్నం ఆంధ్రజాతీయ కళాశాల స్థాపకుల్లో ఆయనా ఒకరు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షపదవికి జరిగిన ఎన్నికల్లో నేతాజీ సుభాష్‌చంద్ర బోస్‌ని ఢీకొన్న ఘన చరిత్ర ఆయనది. భారత స్వాతంత్ర్య కాంగ్రెస్ చరిత్రని కేవలం జ్ఞాపకశక్తి ఆధారంగా ఏ పుస్తకాన్నీ, పత్రికలనీ పరిశీలించకుండానే కేవలం రెండునెలల వ్యవధిలో 1600 పేజీల గ్రంథంగా వ్రాయడం ఆయనకే చెల్లింది. అత్యద్భుత మేధాసంపత్తి, జ్ఞాపకశక్తి కలవాడు. ఆయన గురించిన సమగ్రమైన పుస్తకం ఎక్కడా లభ్యంకాదు. ఆయనే వివిధ సందర్భాల్లో సమావేశాలకి వెళ్ళినప్పుడు శ్రోతలు అడిగే ప్రశ్నలు వాటికి తన సమాధానాలని గ్రంథస్థం చేశారు. ఆ పుస్తకం 1946లో కలకత్తాలో ప్రచురితమైంది. వెయ్యిన్నొక్క ప్రశ్నలు వాటికి సమాధానాలు ఇందులో సంకలితమైనాయి. పట్టాభి సీతారామయ్యగారి గురించి తెలుసుకోడానికి ఈ పుస్తకమే ముఖ్య ఆధారం. అందులోనుంచి ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన 140 ప్రశ్నలని (వాటికి సమాధానాలని) ఏరి తెలుగులోకి అనువాదం చేశారు ప్రముఖ సాహితీవేత్త శ్రీ అక్కిరాజు రమాపతిరావు గారు. ఈ 80 పేజీల అతిచిన్న పుస్తకంలో అత్యంత విలువైన, అరుదైన సమాచారం ఉంది. కేవలం పట్టాభిసీతారామయ్యగారి వ్యక్తిగత జీవిత విశేషాలేకాక వివిధ రంగాలగురించి ఆయన ఊహించిన భవిష్యత్ విశేషాలు అబ్బురం కలిగిస్తాయి. ద్రష్ట అనడానికి సీతారామయ్యగారు ముందుగానే ఊహించి చెప్పిన విషయాలన్నీ ఉదాహరణలే. ప్రతివారూ తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. రచయిత అక్కిరాజు రమాపతిరావుగారి కృషి ప్రశంసనీయం.

****

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**